క్లుప్తంగా

మాల సంఘం డివిజన్ కమిటీ ఎన్నిక



బాన్సువాడ : మాల సంఘం వ్యవస్థాపకులు అయ్యాల సంతోష్ ఆధ్వర్యంలో డివిజన్ కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. డివిజన్ అధ్యక్షులుగా సాయిలు, ఉపాధ్యక్షులుగా దడేకర్ సురేష్, గైని శంకర్, ప్రధాన కార్యదర్శిగా పోతురాజు రాజు, కోశాధికారిగా దండు భూమేష్, సహాయ కార్యదర్శులుగా సదయ్య, కాలే సాయిలు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా రాములును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వ్యవస్థాపకులు అయ్యాల సంతోష్ మాట్లాడుతూ ఎస్సీలపై జరుగుతున్న దాడులు, హింస పై పోరాటం చేస్తామన్నారు. మాలలు ఐక్యంగా ఉండాలని సూచించారు.

మిత్రుడి కుటుంబానికి ఆర్థిక సాయం



రామారెడ్డి : మిత్రుడు అకాల మరణం చెందడంతో ఆకుటుంబానికి స్నేహితులు అండగా నిలిచారు. మండలంలోని ఇసన్నపల్లి గ్రామానికి చెందిన సిద్ధం బైరయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఆకుటుంబానికి చిన్ననాటి మిత్రులు ఆదివారం రూ. 10వేల ఆర్థిక సాయంతో పాటు 50 కిలోల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ సుధాకర్, దోమల శ్రీధర్, కామిని కృష్ణ, గుర్జాగుంట స్వామి మహేందర్, రామస్వామి, మహేందర్, రవి, రామచంద్రం పాల్గొన్నారు

అంబేడ్కర్ విగ్రహ నిర్మాణానికి భూమి పూజ



పిట్లం(జుక్కల్): మండలంలోని అల్లాపూర్ గ్రామంలో అంబేడ్కర్ విగ్రహం నిర్మాణానికి ఆదివారం అంబేడ్కర్ సంఘం ఆధ్వర్యంలో భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు గైని పోచయ్య మాట్లాడారు. కార్యక్రమంలో అంబేడ్కర్ సంఘం సభ్యులు, దళిత నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కోడ్ ముగిసినా ముసుగు తొలగలేదు



మాచారెడ్డి: ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో జాతీయ నాయకుల విగ్రహాలకు అధికారులు ముసుగులు వేశారు. ఎన్నికల కోడ్ ముగిసిపోయింది. అయినా మండలంలోని గజ్యానాయక్ తండా చౌరస్తాలో కామారెడ్డి సిరిసిల్ల రహదారిపై ఉన్న రాజీవ్ గాంధీ విగ్రహానికి వేసిన ముసుగును అధికారులు ఇప్పటికీ తొలగించలేదు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని శెట్పల్లి సంగారెడ్డి గ్రామానికి బాధితులకు ఆదివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. నీల అలేఖ్య రూ. 60 వేలు, సాయిబాబా రూ. 16 వేలు, వడ్ల సుగుణ రూ. 18 వేలు మంజూరు కావడంతో చెక్కులను అందజేశారు. నాయకులు మోహిద్, శ్రీనివాస్, పాపయ్య, సుభాష్, దుర్గయ్య, ప్రశాంత్, బాబు, తదితరులు పాల్గొన్నారు.

బీమా చెక్కు అందజేత



మండలంలోని బాణాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త ఆల్ల బాలయ్య రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మృతుని పేరిట బీమా చెక్కు మంజూరు కావడంతో ఆదివారం మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ వారి కుటుంబ సభ్యులకు రూ.2 లక్షల బీమా చెక్కును అందించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు దివిటి రమేశ్, ముదాం సాయిలు, శ్రీకాంత్, నర్సింలు, గన్నూనాయక్, తదితరులు పాల్గొన్నారు.

సర్కారు బడికి జీవం

- సొంత డబ్బులతో పాఠశాల అభివృద్ధి
- ఏడాదిన్నరలో నాలుగింతలు పెరిగిన విద్యార్థుల సంఖ్య
- ఆదర్శంగా నిలుస్తున్న కల్వరాల్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు



పాఠశాల గోడలపై వేయించిన చిత్రాలు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తగ్గిపోవడంతో ఉపాధ్యాయుడు నిరంతర కృషి చేసి, గ్రామస్తుల సహకారంతో విద్యార్థుల సంఖ్య పెంచి ఆదర్శంగా నిలిచాడు. మండలంలోని కల్వరాల్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విష్ణువర్ధన్ రెడ్డి 2023 సెప్టెంబర్‌లో సిద్దిపేట్ జిల్లా నుంచి పదోన్నతి పొంది సదాశివనగర్ మండలానికి వచ్చాడు.తాను బాధ్యతలు చేపట్టిన తర్వాత గ్రామంలో పాఠశాల లేకుండా పోతుందనే విషయాన్ని గ్రామస్తులతో చర్చించాడు. గ్రామస్తులు సహకారంతో మౌలిక వసతుల కల్పన కోసం సుమారు రూ.2లక్షల వరకు ఖర్చు పెట్టి పాఠశాల వాతావరణాన్ని అందంగా తీర్చిదిద్దాడు. తరగతి గదులకు రంగులు వేయించడం, అధికారుల అనుమతితో శిథిలావస్థకు చేరిన భవనాలను కూల్చి వేయడంతో పాఠశాల రూపు రేఖలు పూర్తిగా మారి పోయాయి. సొంత డబ్బులతో ప్రైవేట్ టీచర్‌ను నియమించి ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నారు.

విద్యార్థుల సంఖ్య పెంచేందుకు కృషి..

పూర్తిగా పడిపోయిన విద్యార్థుల సంఖ్యను మెరుగుపరుచుటకు ప్రత్యేక కార్యాచరణను రూపొందించుకున్నాడు. ప్రతి రోజు ఉదయం 7 గంటలకు గ్రామానికి చేరుకుని గ్రామం నుంచి ఎవరెవరు ప్రైవేట్ పాఠశాలలకు వెళ్తున్నారనే విషయం తెలుసుకుని. ప్రత్యేకంగా వారి తల్లిదండ్రులను మెప్పించి, ఒప్పించి ప్రభుత్వ పాఠశాలకు రావాలని వేడుకున్నాడు. ప్రభుత్వ పాఠశాలలో నిష్ణాతులైన ఉపాధ్యాయులు ఉంటారని, మీ పిల్లల భవిష్యత్తు బాగుంటుందని తల్లిదండ్రులకు వివరించారు. దీంతో పాఠశాలలో 12 నుంచి విద్యార్థుల సంఖ్య 55కు చేరింది. పది తరగతి విద్యార్థులకు ఉదయం గంట, సాయంత్రం గంట పాటు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. 2023–24 టెన్త్ ఫలితాల్లో శతశాతం సాధించారు. పాఠశాలలో విద్యార్థులకు మౌలిక వసతులను కల్పించడమే కాకుండా గ్రీన్ బోర్డు, ఐఎఫ్‌పీ ప్యానెల్ టీవీ, రావడానికి కృషి చేశారు.

జిల్లా, మండల స్థాయిలో గుర్తింపు...

పాఠశాల విద్యార్థులు చదువుతో పాటు సైన్స్ టాలెంట్ టెస్ట్‌ల్లో జిల్లా, మండల స్థాయిల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. జిల్లా స్థాయిలో నిర్వహించిన రోడ్డు భద్రతా వారోత్సవాలు, సైన్స్ టాలెంట్ టెస్ట్‌ల్లో ఉత్తమ ప్రతిభ చూపి శభాష్ అనిపించుకున్నారు.

గ్రామస్తుల సహకారం బాగుంది



పాఠశాలలో విద్యార్థులు లేకుంటే పాఠశాల రద్దు అవుతుందనే విషయాన్ని గ్రామస్తుల దృష్టికి తీసుకెళ్లా. ఇందుకు గ్రామస్తులు సహకరించి విద్యార్థులను పాఠశాలకు పంపించారు. పాఠశాలకు వచ్చిన విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలనే ఉద్దేశ్యంతో సొంత డబ్బులతో మరుగుదొడ్లు, మూత్రశాలలకు మరమ్మతులు చేయించాను. పాఠశాల వాతావరణం బాగుంటే పిల్లలకు చదువుపై శ్రద్ధ కలుగుతుంది. ప్రభుత్వ పాఠశాలను కాపాడుకోవాలనే తపనతోనే ముందుకు సాగుతున్నా.

– విష్ణువర్ధన్ రెడ్డి, కల్వరాల్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు

లక్ష్యం 23లక్షల 22వేల మొక్కలు

- జిల్లాలో 527 నర్సరీల్లో పెంపకం
- మొక్కలు ఎండకుండా గ్రీన్‌నెట్‌ల ఏర్పాటు



బుడిమిలో మొక్కలకు నీళ్లు పడుతున్న వనసేవకుడు

బాన్సువాడ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వనమహోత్సవంలో భాగంగా ప్రతి గ్రామంలో నర్సరీలు ఏర్పాటు చేసి మొక్కల పెంపకం చేపట్టారు. జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ప్రభుత్వ లక్ష్యం మేరకు మొక్కలు పెంచుతున్నారు. జూన్ వరకు కామారెడ్డి జిల్లాలో 23లక్షల 22వేల మొక్కలను సిద్ధంగా ఉంచాలని అధికారులు ప్రణాళిక వేశారు. ప్రతినర్సరీలో 4వేలకు తగ్గకుండా మొక్కలను వర్షాకాలం నాటికి నాటేందుకు సిద్ధం చేస్తున్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ క్షేత్రసహాయకులు కూలీల సహాయంతో వేసవిలో మొక్కలు ఎండిపోకుండా గ్రీన్‌నెట్‌లను ఏర్పాటు చేశారు. వనసేవకుల సహాయంతో ఉదయం, సాయంత్రం వేళల్లో మొక్కలకు నీళ్లపట్టి సంరక్షిస్తున్నారు.

వివిధ రకాల మొక్కలు..

నర్సరీల్లో నీడనిచ్చే మొక్కలతో పాటు జామ, ఉసిరి, అల్లనేరేడు, చింత, మామిడి, సీతాఫలం, దానిమ్మ, బాదం, కర్జూరవంటి మొక్కలను పెంచుతున్నారు. పండ్లమొక్కలతో పాటే గులాబీ, మల్లె, మందారం తదితర పూలమొక్కలను పెంచుతున్నారు. గతంతో పోల్చితే ప్రజలు ఇష్టపడే, భవిష్యత్తులో ఉపయోగపడే వివిధ రకాల మొక్కలను అందుబాటులో ఉండేలా చూస్తున్నారు. వర్షాకాలం ఓ మోస్తారు వర్షాలు పడ్డాక ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ స్థలాలు, రోడ్లకు ఇరువైపుల, రైతుల పొలంగెట్లపై మొక్కలను నాటేందుకు సన్నద్ధం అవుతున్నారు.

నిరంతరం పర్యవేక్షిస్తున్నాం

వనమహోత్సవాన్ని విజయవంతం చేయడానికి ఉన్నతాధికారుల ఆదేశం మేరకు ప్రతి గ్రామంలో నర్సరీలు ఏర్పాటు చేశాం. వాటిని నిరంతరం పర్యవేక్షిస్తూ పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ క్షేత్రసహాయకులకు సలహాలు,సూచనలు ఇస్తున్నాం. అన్నినర్సరీల్లోనూ ప్రతిరోజు ఉదయం సాయంత్రం నీళ్లు పట్టాలని సూచించాం. మొక్కలు చక్కగా ఎదుగుతున్నాయి.

– బషీరుద్దీన్, ఎంపీడీవో, బాన్సువాడ

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



బీబీపేటలో సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న బీజేపీ నాయకులు



పనులు ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

బీబీపేట: మండల కేంద్రంలోని 5వ వార్డులో బీజేపీ నాయకులు ఆదివారం సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన ఎన్ఆర్ఈజీఎస్ కింద మంజూరైన రూ. 5 లక్షలతో పనులు ప్రారంభించినట్లు బీజేపీ మండలాధ్యక్షుడు అల్లం ప్రవీణ్ తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కుంట లక్ష్మారెడ్డి, నరేందర్‌రెడ్డి, రంజిత్‌గౌడ్, రవీందర్, సంతోష్ గౌడ్, నరేష్, సురేష్, బాలు, రమేష్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

శేర్‌ఖాన్‌పల్లి గ్రామంలో...

నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్ నగర్ మండలంలోని శేర్‌ఖాన్‌పల్లి గ్రామంలో రూ. 10 లక్షలతో సిమెంట్ రోడ్ల నిర్మాణ పనులను కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. ఉపాధిహామీ నిధులతో పాటు ఎమ్మెల్యే కోటా నిధుల ద్వారా గ్రామాలు, గిరిజన తండాల్లో మురుగుకాలువ, సిమెంట్ రోడ్ల నిర్మాణం చేపడుతున్నామని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి తెలిపారు. నాయకులు నాగభూషణంగౌడ్, మండల మహిళ నాయకురాలు తాటిపల్లి సరస్వతి తదితరులున్నారు.

ప్రజల భద్రత కోసమే ఫ్లాగ్‌మార్చ్



పెద్దకొడప్‌గల్‌లో అవగాహన కల్పిస్తున్న హెడ్‌కానిస్టేబుల్ రవీందర్



దేవునిపల్లిలో కవాతు నిర్వహిస్తున్న ప్రత్యేక బలగాలు



రాజంపేటలో..

కామారెడ్డి క్రైం: దేవునిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని కాకతీయనగర్, గాయత్రీనగర్ కాలనీలు, దేవునిపల్లి, సరంపల్లి గ్రామాల్లో ఆదివారం రూరల్ పోలీసులు, ఆర్‌ఏఎఫ్ బలగాలు కవాతు నిర్వహించాయి. ఈ సంర్భంగా రూరల్ సీఐ రామన్ మాట్లాడుతూ.. ప్రజల రక్షణ కోసం పోలీసులు ఎల్లవేళలా అందుబాటులో ఉండటం జరుగుతుందన్నారు. పోలీసు శాఖపై మరింత విశ్వాసాన్ని, ప్రజల భద్రతకు మేమున్నామనే నమ్మకాన్ని పెంపొందించడం కోసమే ఆర్ఏఎఫ్ బలగాలతో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

రాజంపేటలో..

రాజంపేట : మండల కేంద్రంలోని ప్రధాన వీధుల్లో ఆదివారం ఎస్సై పుష్పరాజ్ ఆధ్వర్యంలో పోలీస్ సాయుధ బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. భిక్కనూర్ ఎస్సై ఆంజనేయులు, ఆర్ఎస్ఐ సాయి, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్, పోలీసులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

పెద్దకొడప్‌గల్(జుక్కల్): సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెడ్‌కానిస్టేబుల్ రవీందర్ తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో సైబర్ నేరాలపై ఆయన అవగాహన కల్పించారు. అపరిచితులు పంపే మెస్సేజీలకు సమాధానం ఇవ్వొద్దని, బ్యాంక్ లావాదేవీలు, పిన్, ఓటీపీ, వాటిని ఇతరులకు బహిర్గత పర్చద్దన్నారు. కార్యక్రమంలో సాయి శివ, అంజి, జైపాల్ రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తాడ్వాయిలో వాహనాల తనిఖీ

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని కామారెడ్డి –ఎల్లారెడ్డి ప్రధాన రహదారిలో ఆదివారం పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. వాహన ధ్రువీకరణ పత్రాలు లేనివారికి, హెల్మెట్ ధరించని వారికి జరిమానా విధించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ కొండల్‌రెడ్డి, పోలీసు సిబ్బంది, హోంగార్డులు పాల్గొన్నారు.

అధిక ధరలకు మద్యం విక్రయం

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల పరిధిలో రెండు మద్యం షాపుల వ్యాపారులు సిండికేట్ అయ్యారు. బీరు సీసాలపై, లిక్కరు సీసాలపై పెంచిన మద్యం రేట్లు ప్రింట్ రాక ముందే ప్రభుత్వం పెంచిన ధరలకు షాపుల యాజమానులు వసూలు చేస్తున్నారు. ఒక్క బీరు సీసాపై రూ.30 అదనంగా వసూలు చేస్తున్నారు. పాత స్టాక్‌పైనే కొత్త ధరలు వసూలు చేయడం ఏమిటని మద్యం బాబులు వారి తీరుపై అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



పాల్కంపేట ఉన్నత పాఠశాలలో గురువులను సన్మానించిన పూర్వ విద్యార్థులు

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని పాల్కంపేట ఉన్నత పాఠశాలలో 2008–09 సంవత్సర పదోతరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. పూర్వ విద్యార్థులు నాటి మధుర స్మృతులను గుర్తు చేసుకున్నారు. ఈసందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ... విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకున్న రోజున నిజమైన సంతోషం ఉంటుందన్నారు. 15 సంవత్సరాల తర్వాత విద్యార్థులతో కలుసుకోవడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం గురువులను శాలువాలు, మెమొంటోలతో విద్యార్థులు సత్కరించారు.

ఆధ్యాత్మికం

వైభవంగా ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన



బాన్సువాడ రూరల్: మండలంలోని కొల్లూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో ఆదివారం శ్రీఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య స్వామివారి విగ్రహానికి ప్రాణప్రతిష్ఠ చేశారు. ప్రత్యేకంగా నిర్వహించిన పూజ కార్యక్రమంలో బాన్సువాడ ఎమ్మెల్యే, రాష్ట్ర వ్యవసాయ సలహాదారులు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసులబాల్‌రాజు పాల్గొన్నారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామంలోని వివిధ కులసంఘాల ప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు.

రంజాన్ మాసం క్రమశిక్షణను సూచిస్తుంది

బాన్సువాడ రూరల్: రంజాన్ మాసం ముస్లింలకు క్రమశిక్షణను సూచిస్తుందని ఎమ్మెల్యే, రాష్ట్ర వ్యవసాయ సలహాదారులు పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం సాయంత్రం చిన్న రాంపూర్ గ్రామంలో ఇఫ్తార్ విందుకు హాజరై మాట్లాడారు. ఉపవాస దీక్షచేపట్టిన వారికి పండ్లు అందజేశారు. ఈకార్యక్రమంలో నాయకులు మోహన్‌నాయక్, అంబర్‌సింగ్, షేక్ అజీమ్,అలీమోద్దీన్‌బాబా, షేక్ అజీజ్, పర్వుగౌండ, శ్రీనివాస్‌రెడ్డి, మహిమూద్ తదితరులు పాల్గొన్నారు.

భక్తి భావం పెంపొందించుకోవాలి

మద్నూర్(జుక్కల్): ప్రతి ఒక్కరూ భక్తి భావం పెంపొందించుకోవాలని ఖత్‌గావ్ పీఠాధిపతి మల్లికార్జున్‌స్వామి మహరాజ్ పిలుపునిచ్చారు. మండలంలోని హండేకేలూర్‌లో ఆదివారం వాల్మీకి రుషి ఆలయ కలశ స్థాపన, నూతన ఆలయం నిర్మించడంతో ఖత్‌గావ్ మహరాజ్ చేతుల మీదుగా ప్రారంభించారు. మహిళలు హరతులు, కలశాలతో ఊరేగింపు నిర్వహించారు. వార్కారీలు, భజన మండలీల సభ్యులు పాల్గొని భజనలు చేస్తూ శోభాయాత్ర చేపట్టారు.

హనుమాన్ ఆలయం ధ్వజ స్తంభానికి భూమి పూజ

బాన్సువాడ : పట్టణంలోని గొలీగూడ హనుమాన్ ఆలయం వద్ద నూతనంగా నిర్మించే ధ్వజ స్తంభానికి వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్‌లు భూమి పూజ చేశారు. ఆలయంలో హనుమాన్, శివ, రుక్మిణి, విఠలేశ్వర, నంది, నాగదేవత విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపన నిర్వహించారు. గత మూడు రోజులుగా ఆలయంలో హోమం, ప్రత్యేక పూజలు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యక్షత్రియ సంఘం ప్రతినిధులు ఉన్నారు.

ఘనంగా మెహెర్‌బాబా ఆలయ వార్షికోత్సవం

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలోని కన్‌కల్‌లో గల అవతార్ మెహెర్ బాబా ఆలయంలో 44వవార్షిక ఉత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. బాబాచిత్రపటాన్ని అలంకరించిన వాహనంలో ఉంచి గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. సప్త వర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన తదితర కార్యక్రమాలను నిర్వహించారు. బాబాచిత్రపటాన్ని వివిధ రకాల పూల మాలలతో అందంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, సెంటర్ సభ్యులు, ప్రేమికులు పాల్గొన్నారు.

బీబీపేటలో అయ్యప్ప ఆలయ ..



బీబీపేట: మండల కేంద్రంలోని శ్రీ అయ్యప్ప ఆలయ 9వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి శ్రీ ఉన్నికృష్ణ స్వామి వారిచే పూజలు, యజ్ఞం చేశారు. ఆలయంలో గణపతి హోమం, అష్టాభిషేకం, కలశ పూజ, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

శ్రీ రామ నవమి ఉత్సవాలకు ఏర్పాట్లు

వచ్చే నెల 6న జరిగే శ్రీ రామ నవమి పండుగ ఏర్పాట్ల సందర్భంగా ఆదివారం హనుమాన్ ఆలయ కమిటీ సభ్యులు సమావేశం నిర్వహించారు. వారం రోజుల పాటు హనుమాన్ ఆలయం భజన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమాలకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని హనుమాన్ ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

ముగిసిన శ్రీకృష్ణ గీత మందిరం వార్షికోత్సవం

కామారెడ్డి అర్బన్: మనిషి సమస్యలకు పరిష్కారం చూపేది భగవద్గీత అని హరిద్వార్‌కు చెందిన స్వామి వేదాత్మానంద సరస్వతి అన్నారు. స్థానిక శ్రీకృష్ణ గీత మందిరం 23వ వార్షికోత్సవం సందర్భంగా ఈనెల 3 నుంచి నిర్వహిస్తున్న భగవద్గీతా సప్తాహం, గీత జ్ఞాన ప్రవచనాలు ఆదివారంతో ముగిశాయి. వేదాత్మానంద సరస్వతి ప్రవచనం ఇచ్చారు. దేవ యజ్ఞం, పూర్ణాహుతి నిర్వహించారు. వేదాత్మానంద సరస్వతితో పాటు సత్యమిత్ర ఆర్య, కృష్ణానందస్వామి, ఓంకారనందస్వామి, రామస్వామి, సనకసనంద స్వామిజీలను గీత మందిరం తరపున ఘనంగా సన్మానించారు. గీత మందిరం ప్రతినిధులు పాత అశోక్, అర్వపల్లి రమేష్, పార్శి లక్ష్మిపతి తదితరులు పాల్గొన్నారు.

మేజర్‌వాడిలో ఘనంగా బోనాల పండుగ

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని మేజర్‌వాడిలో ఇటీవల పెద్దమ్మతల్లి, మల్లికార్జునస్వామి ఆలయాలను నిర్మించారు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం మల్లికార్జునస్వామికి, సాయంత్రం పెద్దమ్మతల్లికి వేర్వేరుగా బోనాలను సమర్పించారు. ఈ సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

ఆలయాల్లో మాజీ ఎమ్మెల్యే పూజలు



బాన్సువాడ : బీర్కూర్ మండలం తిమ్మాపూర్ వేంకటేశ్వర ఆలయంలో ఆదివారం ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలను తిలకించారు. వేదపండితులు మాజీ ఎమ్మెల్యేకు ఆశీర్వాదం ఇచ్చారు. అక్కడి నుంచి భారీ కాన్వాయ్‌తో బాన్సువాడ మండలం కొల్లూర్ హనుమాన్ ఆలయ వార్షికోత్సవానికి ఆయన హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట బీర్కూర్ మాజీ జెడ్పీటీసీ ద్రోణవల్లి సతీష్ ఉన్నారు.

నేడు వీరభద్రుడి ఆలయ వార్షికోత్సవం

పిట్లం(జుక్కల్): మండలంలోని కంభాపూర్‌లో శ్రీ వీరభద్రుడి ఆలయ వార్షికోత్సవం సోమవారం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ఆలయాన్ని అందంగా ముస్తాబు చేశారు. సోమవారం ఆలయంలో పల్లకీ సేవతో పాటు అగ్నిగుండం కార్యక్రమం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

సంక్షిప్తం

ఆర్యక్షత్రీయ సంఘం కార్యవర్గం ఎన్నిక



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలోని చిట్యాల గ్రామంలో ఆదివారం ఆర్యక్షత్రీయ సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎండిగే విఠల్‌రావు, ఉపాధ్యక్షుడిగా ఘన్‌శ్యాం కిషన్‌రావు, ప్రధాన కార్యదర్శిగా దేవునిపల్లి భీంరావు, కోశాధికారిగా ఆరాలి బాపురావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో అంబీర్‌నరేందర్‌రావు, నిట్టురఘు, మనోహర్‌రావు, లక్ష్మణ్‌రావు, శంకర్‌రావు, సంగారావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



కామారెడ్డి అర్బన్: స్థానిక సాందీపని డిగ్రీ కళాశాలో ఉత్తమ ఉపాధ్యాయుల అసోసియేషన్ ఆధ్వర్యంలో 2024 సంవత్సరం ఉత్తమ ఉపాధ్యాయ దంపతులను, 8మంది మహిళా ఉపాధ్యాయులను ఆదివారం సన్మానించారు. అలాగే అసోసియేషన్ డైరీ ఆవిష్కరించారు. పది ప్రాథమిక పాఠశాలకు ఇరువై కుర్చీల చొప్పున విరాళం అందజేస్తామని ప్రకటించారు.అసోసియేషన్ అధ్యక్షుడు మనోహర్, ప్రధాన కార్యదర్శి బాల్‌రెడ్డి, ప్రతినిధులు హరిప్రసాద్, విష్ణువర్ధన్, అంబీర్ మనోహర్‌రావు, విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిలో కోతుల బెడద

ఎల్లారెడ్డి: పట్టణంలో కోతుల బెడద తీవ్రంగా ఉందని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. పట్టణంలోని ప్రతి కాలనీలో కోతుల కారణంగా జనాలు ఇబ్బందులు పడుతున్నారు. గత రెండు రోజుల క్రితం పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్న సంగయ్య అనే వ్యక్తిపై కోతులు దాడి చేయడంలో కాలికి తీవ్రగాయాలయ్యాయి. అధికారులు స్పందించి కోతుల బెడదను నివారించేలా చర్యలను తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

సహాయత అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్‌గా సలీం

కామారెడ్డి అర్బన్ : సమాచార హక్కు చట్ట పరిరక్షణ కమిటీ రాష్ట్ర డైరెక్టర్, న్యాయవాది ఎంఏ సలీం మానవాదికర్ సహాయత అసోసియేషన్ (ఏఎస్ఏ) స్వచ్ఛంద సంస్థ తెలంగాణ రాష్ట్ర చైర్మన్‌గా నియమితులయ్యారు. మానవతా, జాతీయత, అవినీతికి వ్యతిరేకంగా మానవాదికర్ సహాయత అసోసియేషన్ పనిచేస్తుందని రాష్ట్ర చైర్మన్ ఎంఏ సలీం పేర్కొన్నారు.